ప్రజాశక్తి

గురువారం 4 డిసెంబర్ 2025

శీతాకాల రుగ్మతలకు ఆయుర్వేదంతో ఉపశమనం

ప్రజాశక్తి-సీతానగరం

శీతాకాలంలో ప్రబలే రుగ్మతలకు ఆయుర్వేద ఔషధాలతో మెరుగైన ఆరోగ్య ఫలితాలు ఉంటాయని బూర్జ ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి సూచించారు. బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో రోగులకు తనిఖీలు చేస్తూ శీతాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, నివారణోపాయాలపై బుధవారం పలు సూచనలు చేశారు. మన పరిసరాల్లో ఆయుర్వేద గుణాలున్న ఔషధ మొక్కలు, ఇంటి వద్ద చిట్కాలు కూడా శీతాకాల రుగ్మతకు ఎంతగానో దోహద పడతాయన్నారు. వేడినీటిలో కర్పూరం, పసుపు, తులసి ఆకులు వేసి ఆవిరి పట్టడం ద్వారా పడిశం, గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. ప్రజల అవగాహనకు ఔషధ గుణాలున్న మొక్కలను వైద్యశాల ప్రాంగణంలో వేశామన్నారు.

మంత్రి పరివారం చుట్టూ

వివాదాల ఉచ్చు

- మొన్న పిఎ సతీష్‌పై కేసు నమోదు
- నిన్న డ్రైవర్‌పై వైసిపి ఫిర్యాదు
- సంధ్యారాణికి మరో తలనొప్పి

మంత్రి డ్రైవర్‌పై ఫిర్యాదు చేస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పిఎ నాగరాజు, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాజీ పిఎ సతీష్‌పై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసు కొద్ది రోజుల క్రితం నమోదైంది. పట్టణానికి చెందిన ఓ వితంతు మహిళా ఉద్యోగి.. మంత్రి మాజీ పిఎ సతీష్‌పై ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సతీష్‌పై సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి ప్రతిగా టిడిపి నాయకులు కూడా ఓ టివి ఛానల్, పత్రికలపై ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులపై విచారణ జరుగుతోంది. ఈ కేసుల వేడి చల్లారక ముందే మంత్రి సంధ్యారాణి కారు డ్రైవర్ రౌతు హరికుమార్ పై మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పిఎ అధికార్ల నాగరాజు బుధవారం సాయంత్రం సాలూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా ప్రచార విభాగం కన్వీనర్ గిరి రఘుతో కలిసి నాగరాజు టౌన్ సిఐ బి.అప్పలనాయుడుకు ఫిర్యాదు అందజేశారు. హరికుమార్ రెండు రోజుల క్రితం తనపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన, జుగుప్సాకరమైన పదజాలంతో పోస్టులు పెట్టారని నాగరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొంతకాలంగా మంత్రి సంధ్యారాణి డ్రైవర్ హరికుమార్ తరచూ తనని అవహేళన చేస్తూ మాట్లాడడమే కాకుండా వాట్సాప్ గ్రూపుల్లో అవమానకరమైన రీతిలో పోస్టులు పెట్టారని తెలిపారు. దీనివల్ల తాను సమాజంలో తలెత్తుకుని తిరగలేని పరిస్థితి ఏర్పడిందని, మానసికంగా కుంగిపోతున్నానని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన మంత్రి సంధ్యారాణి డ్రైవర్ హరికుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంధ్యారాణికి సరికొత్త తలనొప్పి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి తన పరివారంలోని వ్యక్తుల వ్యవహార శైలి సరికొత్త తలనొప్పులు తెప్పిస్తోంది. ఆమెను రాజకీయంగా మరింత ఇరకాటంలో పెట్టే పరిస్థితికి దారి తీస్తోంది. వారం రోజుల క్రితం మంత్రి సంధ్యారాణి పిఎ సతీష్‌పై కేసు వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి దారి తీసింది. సిఎంఒ కార్యాలయం జోక్యం చేసుకుని సతీష్‌ని అనధికార పిఎ బాధ్యతల నుంచి తొలగించింది. ఈ వేడి నుంచి ఇంకా బయటపడక ముందే మరో వివాదం మంత్రి సంధ్యారాణి డ్రైవర్ హరికుమార్‌పై రాజుకుంటోంది. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర పిఎ నాగరాజుపై మంత్రి సంధ్యారాణి డ్రైవర్ హరికుమార్ అసభ్యకరమైన పోస్టులు పెట్టడం వివాదాస్పద మవుతోంది. దీనిని వైసిపి నాయకత్వం కూడా సీరియస్‌గా తీసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు తెలుస్తోంది.

పాలకొండ పంచాయితీ తీరేనా?

- నేడు లోకేష్‌తో టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

భామిని మండలంలో మంత్రి నారా లోకేష్ గురువారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ.. జనసేన కావడంతో నియోజకవర్గంలోని టిడిపి కేడర్ ఈ సమావేశానికి హాజరవుతున్నారు. మొదటి నుంచీ ఇక్కడ గ్రూపులు కొనసాగుతూ వస్తున్నాయి. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవితో కొంతమంది నాయకులు ఉన్నారు. జయక్రిష్ణ.. జనసేన ఎమ్మెల్యే అయినప్పటికీ కొంతమంది టిడిపి నాయకులు ఆయనతోనే కలిసి ఉంటున్నారు. గతంలో జయక్రిష్ణ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉండటమే అందుకు కారణం. దీంతో పార్టీలో గ్రూపుల గోల కనిపిస్తూనే ఉంది. పార్టీ సంస్థాగత పదవులతోపాటు సొసైటీల కార్యవర్గాలు కూడా నియోజకవర్గంలో ఎక్కడా నియామకం కాలేదు. దీనికి నేతల మధ్య ఐక్యత లేకపోవడమే కారణమని ఆ పార్టీలోనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులతో మంత్రి లోకేష్ సమావేశం కానుండటంతో ఈ విషయాలన్నీ చర్చకు వస్తాయా? లోకేష్ వీటికి చెక్ పెడతారా? పాలకొండ పంచాయితీకి ముగింపు పడనుందా? వేచి చూడాల్సి ఉంది.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌పి మాధవరెడ్డి, తదితరులు

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-భామిని

ఈ నెల ఐదో తేదిన సిఎం చంద్రబాబునాయుడు భామినిలో పర్యటించనున్న విషయం తెలిసిందే. భామిని ఆదర్శ పాఠశాలలో జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రానున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌పి మాధవరెడ్డి పరిశీలించారు. హెలీప్యాడ్, సమావేశ ప్రాంగణం, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో, ఎటువంటి ఇబ్బందీ లేకుండా కార్యక్రమం జరగాలని, అన్ని శాఖల సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

వీరఘట్టం : ఈ నెల ఐదో తేదిన భామినిలో సిఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి నిమ్మక పాండురంగ కోరారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచీ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొనేలా బాధ్యత వహించాలన్నారు. నియోజకవర్గ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మాచర్ల అనీల్, ఎన్.శశిభూషణరావు, వెంకటరమణ, చింత ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా ధాన్యం కొనాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

డంగభద్ర లో రైతులతో కలిసి నిరసన తెలియజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

ఎటువంటి ఆంక్షలూ లేకుండా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలోని డంగభద్రలో రైతులు నూర్పు చేసి భద్రపరచుకుంటున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసిన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు విషయంపై ప్రభుత్వం తక్షణమే ఆంక్షలు తొలగించాలన్నారు. కూటమి ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు ప్రచారమే గాని, కేంద్రాల ద్వారా రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుల వద్ద 80 కేజీల బస్తాపై అదనంగా నాలుగు కిలోలు తీసుకుంటూ రైస్‌మిల్లులకు మళ్లిస్తున్నారని ఆగ్రహించారు. రైస్‌మిల్లుల్లో ఉన్న స్టాక్‌పై విచారణ చేపట్టి, మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాలు పనిచేయకపోవడంతో రైతులు బస్తాలు తెచ్చుకొని ధాన్యాన్ని స్వయంగా భద్రపరుచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. దళారుల బారినపడి రైతులు కేవలం రూ.1700కే ధాన్యాన్ని అమ్ముకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. తుపాను కారణంగా ధాన్యం తడిసిన పరిస్థితుల్లో ఉన్నందున ఎటువంటి ఆంక్షలూ లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రవాణాకు రైతులే వాహనాలు సమకూర్చుకోవాలని, వాటికి జిపిఎస్ అనుసంధానం కావాలని అధికారులు చెప్పడం వల్ల రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకురాలేకపోతున్నారని తెలిపారు. జిపిఎస్‌తో సంబంధం లేకుండా రైతు తీసుకొచ్చిన ఏ వాహనాన్నైనా అనుమతించి, ధాన్యం సేకరించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు మద్దతుధర ఇప్పించాలి

బలిజిపేట : ధాన్యం రైతులకు మద్దతుధర ఇప్పించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు వై.మన్మథరావు, బి.భానుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బలిజిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 40 కిలోల బస్తాకు గాను 42 కిలోలు తూనిక వేస్తున్నారని, దింపుడు కూలి రూ.5 రైతులు ఇవ్వాలని వసూలు చేస్తున్నారని తెలిపారు. తుపాను పేరుతో ధాన్యం బాగాలేవని, తడిగా ఉన్నాయని చెప్పి మిల్లులకు వెళ్తున్న ధాన్యం ఎక్కువ తూకం ఇస్తేనే ఉంచుతున్నారని, లేకపోతే వెనక్కి తీసుకెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు. కలెక్టర్, జిల్లా యంత్రాంగం శ్రద్ధ తీసుకొని తూకంలో మోసాలు అరికట్టి, రైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సిపిఎం నాయకులు పెంచలయ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపేయాలన్నారు.

నీతి కథలు.. చక్కని జీవితానికి బాటలు

పిఎంబిఎఫ్‌లో వక్తలు

చెట్లు చెప్పిన కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ప్రజాశక్తి-పార్వతీపురం

నీతి కథలు చక్కని జీవితానికి బాటలు వేస్తాయని వక్తలు తెలిపారు. పార్వతీపురం మన్యం పుస్తక మహోత్సవం (పిఎంబిఎఫ్)లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం సాయంత్రం కళారత్న డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన సాహిత్య సభ జరిగింది. కార్యక్రమంలో బాల సాహిత్యంలో నీతి కథలు అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ కథా రచయిత నారంశెట్టి ఉమామహేశ్వరరావు ప్రసంగించారు. పిల్లలకు బాల్యం నుండే నీతి కథలు వినిపించడం, చదివించడం, పుస్తక పఠనం అలవాటు చేయడం ద్వారా వారి వ్యక్తిత్వాన్ని గొప్పగా తీర్చిదిద్దవచ్చునని చెప్పారు. కథలు చదవడం ద్వారా దేశభక్తి, పరోపకారం, ముందుచూపు, సమయస్ఫూర్తి, కృతజ్ఞత, సహాయగుణం, వినయం, క్షమాగుణం , సహనం, విచక్షణ మొదలైన అనేక సద్గుణాలు కలుగుతాయన్నారు. పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, తద్వారా పాఠ్య పుస్తకాలు చదవడంలో అనుకూలత ఏర్పడుతుందని తెలిపారు.

బాలసాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు రచించిన 'చెట్లు చెప్పిన కథలు' నవలను అతిథులు ఆవిష్కరించారు. నవలను ప్రముఖకవి పక్కి రవీంద్రనాథ్ సమీక్షించారు. పర్యావరణ ప్రాముఖ్యత చాటుతూ రాసిన ఈ నవలలో చెట్లు వల్ల కలిగే ప్రయోజనాలను రచయిత అందంగా వివరించారని చెప్పారు. చెట్లు నరకడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయని, చెట్లు చేస్తున్న ఉపకారాన్ని గుర్తు పెట్టుకుని వృక్షాల ఎదుగుదలకు జనమంతా తోడ్పడాలని చెప్పారు.

తొలుత పారినాయుడు మాట్లాడుతూ పెద్ద నగరాలకు సమానంగా ఎక్కువ మంది బాలసాహితీవేత్తలున్న పట్టణంగా పార్వతీపురం ఖ్యాతి గడించిందని చెప్పారు. చుట్టుపక్కల మరే జిల్లాకు దక్కని ఖ్యాతిని నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగాం భీమేశ్వరరావు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాలను పొందడం ద్వారా తీసుకొచ్చారని అన్నారు. జాతీయ పురస్కార గ్రహీతలున్న సభకు అధ్యక్షత వహించడం సంతోషంగా ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు బెలగాం భీమేశ్వరరావు, తుంబలి శివాజీ, బి.వి.పట్నాయక్, గొట్టాపు శ్రీనివాసరావు, పతివాడ ధనుంజయరావు, వంజరాపు శేషు , ఈదుబిల్లి ఉషారాణి, జగన్నాథం, మీసాల చిన గౌరునాయుడు, చింత రమణ, చిన్నారి ప్రశాంతి, నాగిరెడ్డి గౌతమి, గర్భాపు రాజ, బూరగాన దుర్గా ప్రసాద్, గుడ్ల అమ్మాజి పాల్గొన్నారు.

కోలాటం ఆడుతున్న విద్యార్థులు

అలరించిన కోలాటం

పుస్తక మహోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం సాహిత్య కార్యక్రమం అనంతరం ఎన్.ములగ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. విద్యార్థులను సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు ఎస్.మురళీమోహన్ రావు, కిరణ్ పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పెంచలయ్య హత్య కేసులో

నిందితులను శిక్షించాలి

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి ● ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసనర్యాలీ

ప్రజాశక్తి-సాలూరు

నెల్లూరు జిల్లాలో ప్రజా గాయకుడు, సిపిఎం నాయకులు పెంచలయ్య హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యాన బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బి.లక్ష్మి, ఆర్.శ్రీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు, నాయకులు టి.వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి లేకుండా ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని డిమాండ్ చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని, పోలీసులు వాటిపై చర్యలు తీసుకోవడంలో వెనుకబడ్డారని విమర్శించారు. దీనిపై పెంచలయ్య తాను నివసిస్తున్న కాలనీలో గంజాయికి వ్యతిరేకంగా యువతను చైతన్యం చేశారని తెలిపారు. దీంతో ఆయనను గంజాయి మాఫియా అతి కిరాతకంగా హత్య చేసిందని, ఈ దురాగతానికి ఒడిగట్టిన, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచలయ్య కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గౌరీ, రాముడు, రవి, శంకరు, లక్ష్మి, నాగమణి, పోలరాజు, శ్రీను పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించండి

పార్వతీపురం టౌన్ : మన్యం జిల్లా అభివృద్ధిపై సిఎం చంద్రబాబునాయుడు దృష్టిసారించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్‌విఎస్ కుమార్ కోరారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జంఝావతి, జంపరకోట, పెదగెడ్డ, నేరడి బ్యారేజ్, తోటపల్లి ప్రాజెక్టు కాలువల ఆధునీకరణ, వట్టిగెడ్డ పనులు పూర్తిచేయాలన్నారు. ఏనుగుల సమస్యకు చెక్ పెట్టాలని కోరారు. పంటలకు మద్దతుధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రౌతు దుర్గాప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి దుర్గారావు, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు బి. రవికుమార్, కూరంగి గోపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన సంక్షేమం'లో పందికొక్కులు

రాత్రి వేళల్లో హాస్టల్ బియ్యం తరలింపు ● విద్యార్థులతో తరలిస్తున్నారు : గ్రామస్తులు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పందికొక్కులు నిరుపేద గిరిజన విద్యార్థుల బియ్యాన్ని మెక్కుతున్నాయి. పాఠశాలలో పిల్లలకు ఆహారంగా పంపిణీ చేస్తున్న బియ్యం బస్తాలు రాత్రి వేళల్లో దారిమళ్లి పోతున్నాయి. కంచే చేను మేసిన చందంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులే పదో తరగతి విద్యార్థులతో బయటకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మండలంలోని రావికోన గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 150మంది విద్యార్థులు ఉన్నారు. కొద్దినెలల క్రితం పాఠశాలలో పనిచేస్తున్న వార్డెన్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ప్రధానోపాధ్యాయులే వార్డెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాత్రి వేళల్లో యథేచ్ఛగా బియ్యం బస్తాలు బయటకు వెళుతున్నాయని పాఠశాలకు సమీపంలో ఉన్న గిరిజనులు చెపుతున్నారు. గిరిజన విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టకుండా బియ్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. పదోతరగతి విద్యార్థులతో పాఠశాల నుంచి 25కిలోల బియ్యం బస్తాలను బయటకు పంపిస్తున్నారని గ్రామస్తులు బహిరంగంగానే చెపుతున్నారు.

రాత్రిపూట తరలిస్తున్న బియ్యం బస్తాలు

రావికోనలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల

రాత్రివేళల్లో బియ్యం బస్తాల తరలింపు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి 25కిలోల బియ్యం బస్తాలను బయటకు పంపిస్తున్నారు. రెండు మూడు రోజులకోసారి ఈ విధంగా తరలిస్తున్నారు. పిల్లలకు ఆహారంగా పంపిణీ చేయాల్సిన బియ్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

- కోలక పెంటయ్య, గిరిజనుడు, రావికోన

విద్యార్థులతో తరలిస్తున్నారు

హాస్టల్ నుంచి తరచుగా బియ్యం బస్తాలను విద్యార్థులతో తరలిస్తున్నారు. గిరిజన విద్యార్థుల కడుపు మాడ్చి బియ్యం బస్తాలు అమ్ముకుంటున్నారు. గిరిజన సంక్షేమ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పాఠశాల హెచ్‌ఎం ఇలాంటి పనులు చేస్తున్నారు.

- కోలక చామంతి, గిరిజన మహిళ, రావికోన

విచారించి చర్యలు తీసుకుంటాం

రావికోన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి బియ్యం బస్తాలు బయటకు వెళ్లిన విషయం ఇంతవరకు నా దృష్టి కి రాలేదు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

- కృష్ణవేణి, సహాయ గిరిజన సంక్షేమ అధికారి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కోరారు. పట్టణంలో ఉన్న గాయత్రి డిగ్రీ కళాశాలలో బుధవారం ఎపిఎస్-ఎస్‌డిసి ఆధ్వర్యాన ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కనున్న తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రానికి అధిక పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ ప్రతినిధులు, గాయత్రి డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయభాస్కర్

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి

ఆర్‌జెడి విజయభాస్కర్

ప్రజాశక్తి - కురుపాం

పది, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించి, శ్రద్ధ తీసుకోవాలని ఆర్‌జెడి విజయభాస్కర్ సూచించారు. బుధవారం కురుపాంలోని ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారు మెరుగైన ఫలితాలు సాధించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు అందించారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో 9వ తరగతి చదువుతున్న టి.హేమ జావెలిన్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించడంతో ప్రిన్సిపల్, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై వీఆర్ఎల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వీఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం డిటి రత్నకుమారికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, వీఆర్ఎల సంఘం ఉపాధ్యక్షులు గోపి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరిధిలో రైతులకు, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న వీఆర్ఎలకు ఏడేళ్లుగా వేతనాలు పెంచడం లేదన్నారు. నెలకు కేవలం రూ.11 వేలు జీతంతో కుటుంబాలు గడపక అవస్థలు పడుతున్నారని వాపోయారు. పెట్రోల్, గ్యాస్, కరెంటు ఛార్జీలు, విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయని చెప్పారు. ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు ఎన్నిసార్లు కలిసి సమస్యను విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఈ డిమాండ్లపై ఈ నెల 9న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎలు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల వినతి

ప్రజాశక్తి-సీతానగరం

పెదంకలాంలోని గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు వెంటనే చెల్లించి, కొనసాగించాలని గ్రీన్‌అంబాసిడర్ల సంఘం జిల్లా అధ్యక్షులు జయకుమార్ గౌరు, సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ.. బుధవారం స్థానిక ఎంపిడిఒ ఎస్‌వివి ప్రసాద్‌కు వినతి అందించారు. గ్రామంలో ముగ్గురు గ్రీన్ అంబాసిడర్లకు 17 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని వివరించారు. ఇలాంటి తరుణంలో వారిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శి చెప్పడం దారుణమన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసిన వైద్య సిబ్బంది

జాకురులో 'మా ఊరికి మలేరియా వచ్చింది'

ప్రజాశక్తి-కొమరాడ

మారుమూల గిరిజన గ్రామమైన జాకురులో మా ఊరికి మలేరియా వచ్చింది.. అనే కార్యక్రమాన్ని మండల అధికారులు బుధవారం చేపట్టారు. మసిమండ పంచాయతీలో గిరిశిఖర గ్రామమైన జాకురుకు అధికారులు వెళ్లి, గ్రామంలో మలేరియా బాధితులను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి, ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అంగన్వాడీ, పాఠశాలల్లో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించి, పలు సూచనలు చేశారు. తాగునీటి శాంపిళ్లు సేకరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.రమేష్, కోనేరు రామభద్రపురం వైద్యాధికారి శ్యామ్యూల్, డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో

ప్రజాశక్తి-మక్కువ

పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయ సైకిల్‌యాత్ర నాలుగో రోజు బుధవారం మక్కువ నుంచి ఎ.వెంకంపేట మీదుగా బొబ్బిలి మండలంలోకి ప్రవేశించింది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు నినాదాలు చేశారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఎ.వెంకంపేట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర బృందం ముందుకు కదిలింది. పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు సైకిల్‌యాత్రకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి, మక్కువ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యకళాశాలల ప్రయివేటీకరణతో నష్టం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సంతకాలు సేకరిస్తున్న అలజంగి జోగారావు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయంతో పేదల వైద్యానికి, పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణంలో బెలగాం ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలో బుధవారం జోగారావు ఆధ్వర్యాన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ వైద్య కళాశాలలను నేడు కూటమి ప్రభుత్వం పూర్తి చేయకుండా, వాటిని ప్రయివేటు వ్యక్తులకు దోచిపెట్టడానికి ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా సంతకాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. ఈ మేరకు సేకరించిన సంతకాలను ఈ నెల 16న గవర్నర్‌కు మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమగిరిపై పార్కు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం హనుమగిరి కొండపై చిల్డ్రన్ పార్కు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. భావితరాలకు పార్కు ఏర్పాటు చేయాలని, ప్రశాంతమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఆలయ సంఘం కమిటీ ప్రతినిధి కింతలి వెంకటరావు రూ.5 లక్షల వ్యయంతో పార్కు పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్ బి.గౌరీశంకర్రావు తెలిపారు. జారుడు బల్ల, తూగుటుయ్యాల వినోదాన్ని పంచే అన్ని రకాల ఆట వస్తువులు అందుబాటులో ఉంచారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సాలూరు

కురుకుట్టి గ్రామంలో సాలూరు ట్రైబల్ రెన్యువల్ ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కేకును కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల పాటలు, నృత్యాలతో అలరించారు.

అంతర పంటలపై దృష్టిపెట్టండి

'రైతన్నా మీ కోసం'లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- భామిని

రైతులు అంతర పంటలపై దృష్టిపెట్టాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. భామిని రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖిముఖి మాట్లాడారు. సేంద్రియ, ఆధునిక వ్యవసాయ విధానాలు, 6 రకాలు, నవరత్నాలు వ్యవసాయ విధానంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. వ్యాపారపరంగా లాభదాయకమైన పంటలు పండించాలని చెప్పారు. పంట మార్పిడి విధానం ద్వారా చీడపీడల నుండి రక్షణ, దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా రైతులు వెళ్లాలని, పండ్ల మొక్కలు పెంపకం, పామాయిల్ పంటల వైపు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, వ్యవసాయాధికారి కొల్లి తిలక్, విఎఎలు ఎర్రన్న, ఈశ్వర్, తేజ పాల్గొన్నారు.

కురుపాం : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలో నీలకంఠాపురంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం' వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఐదు పంచసూత్రాలు పాటించి పర్యావరణ హితం కోసం సాగు కొనసాగించాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, వ్యవసాయ శాఖ అధికారి కె. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : రైతు సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. సీతానగరం మండలం పణుకుపేట గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పంట పొలాల్లో డ్రోన్ సాయంతో క్రిమిసంహారక మందులు జల్లే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి భారతి, ఎఒ ఎస్.అవినాష్, ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఆర్ఐ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు రౌత్ వేణుగోపాల నాయుడు, సర్పంచ్ బంకురు పద్మావతి, మాజీ జెడ్‌పిటిసి చింటూ వెంకటప్పలనాయుడు, మాజీ సర్పంచ్ తేలు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతన్నా మీకోసం వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సౌజన్య, కూటమి నాయకులు ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, తూముల రమేష్ ,జంపు చంద్రశేఖర్, సుక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని చినబగ్గ రైతు సేవా కేంద్రం పరిధిలో సర్పంచ్ బిడ్డిక నీలయ్య అధ్యక్షతన విఎఎ భారతి ఆధ్వర్యంలో రైతన్నా మీకోసం వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రస్తుతం జీడిమామిడి పంటలో యాజమాన్య పద్ధతులు ఏ రకంగా చేసుకోవాలో రైతులకు వివరించారు ఆర్‌డిఎస్ విత్తనాలను సర్పంచ్ రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎన్‌ఎఫ్‌ఎ ముసలయ్య, డివిజన్ ఇన్‌ఛార్జి బాలు, యూనిట్ ఇన్‌ఛార్జి ధర్మారావు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

సాలూరు : మండలంలోని కూర్మరాజుపేట రైతు సేవా కేంద్రంలో రైతన్నా మీకోసం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్‌టిటి లీడర్ కె.ప్రకాష్, డిపిఎం శ్రవణ్ కుమార్, ఎఒ శిరీషా మాట్లాడుతూ రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, సర్పంచ్ నళిని, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట : రైతులు, శాస్త్రవేత్తలు, గ్రామైక్య సంఘాలు, వ్యవసాయ అధికారులంతా కలిసి గ్రామ వ్యవసాయ అభివృద్ధి ప్రణాళిక తయారుచేసి తద్వారా రైతు అభివృద్ధికి పాటుపడాలని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. పాంచాలి గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీకోసం వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. యూరియా వినియోగాన్ని తగ్గించి నానో యూరియా వాడాలని సూచించారు. అమ్మవలస, కర్రివలస గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో ప్రకృతి సేద్య రీజనల్ కోఆర్డినేటర్ కె.ప్రకాశ్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య రీజనల్ ట్రైనింగ్ అధికారి హేమసుందర్, జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రావణ్‌కుమార్ నాయుడు, మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కురుపాం.. విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ; సీతానగరం.. డ్రోన్ ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

భామిని.. రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-కురుపాం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకంలో భాగంగా 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి కొరతను శాశ్వతంగా నివారించే లక్ష్యంతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టుకు రూ.1.19 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్. వేణుగోపాల్, టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, సర్పంచ్ ఎ.మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు నూతనంగా రక్షిత పథకాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురం సాయి హనుమగిరి కొండ మీద రూ.70 లక్షలతో మంజూరైన రక్షిత మంచి ట్యాంకు నిర్మాణానికి ఎమ్మెల్యే బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి అయితే పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజలందరికీ పుష్కలమైన తాగునీరు అందుతుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కూడా నీటి సమస్య ఉన్న చోట నూతనంగా ట్యాంకులు మంజూరు చేస్తామన్నారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ నాగేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు , ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎఇ ప్రవీణ్ కుమార్, టిడిపి, బిజెపి మండల కన్వీనర్లు అడ్డాకుల నరేష్, కె.అప్పలస్వామి, నాయకులు వెంపటాపు భారతి, జానకి, పాడి సుదర్శన్ రావు, నిమ్మక సింహాచలం, మద్ది దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు

ఎండిఎంను ప్రయివేటీకరించొద్దు

ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-సాలూరు

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరించొద్దని స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద బుధవారం ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు చౌక్కాపు సుశీల, రేవతి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పాఠశాలల్లో విద్యార్థులకు సేవలందిస్తున్న వర్కర్ల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల్లో గెలిస్తే జీతాలు పెంచుతామని టిడిపి కూటమి ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. గతంలో టిడిపి అధికారంలో ఉనప్పుడు ఇదే విధంగా భోజన పథకంలో ప్రయివేటీకరణ విధానాలు తీసుకువచ్చిందని, అప్పుడు సంఘం పోరాడితే వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. దీనికి రెట్టింపుగా కార్మిక వర్గాన్ని పోరాటాలకు సిద్ధం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎంఇఒ ఎన్.వెంకటరావు స్పందిస్తూ కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాములమ్మ, గంగమ్మ, సుహాసిని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు..

ఆరోగ్య అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్‌మోహన్

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌బిఎస్‌కె పిఒ జగన్ మోహన్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

విద్యార్థులకు వ్యాధులు, ఆరోగ్య అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించాలని ఆర్‌బిఎస్‌కె పిఒ టి.జగన్‌మోహనరావు సూచించారు. కొత్తవలస-2లోని కెపిఎం ఉన్నత పాఠశాలను బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య, ఉపాధ్యాయ సిబ్బందితో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై సమీక్షించారు. ఆరోగ్య వివరాల రికార్డులు ఎప్పటికపుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల లభ్యత, డబ్ల్యుఐఎఫ్ఎస్ కార్యక్రమ నిర్వహణపై సిబ్బందిని ఆరా తీసి, విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య అంశాలపై వారికున్న పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఆరోగ్య సూత్రాలను తెలియజేసే ఫ్లిప్ చార్టులు, కరపత్రాలను విద్యార్థులతో చదివించి అవగాహన కల్పించారు. వ్యక్తగత పరిశుభ్రతతో అనేక వ్యాధులను దూరంగా ఉంచవచ్చని చెప్పారు. వీటిలో ముఖ్యంగా చర్మ వ్యాధులు, నులిపురుగుల సంక్రమణ నియంత్రించవచ్చని తెలిపారు. చేతుల పరిశుభ్రతపై అందరితో డెమో చేయించి ఆవశ్యకత తెలియజేశారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, వీటి వల్ల ఆకలి మందగించి పోషకాహార లోపం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వై.గణేష్, ఎంజిఎం. చాంద్, ప్రధానోపాధ్యాయులు వై.అప్పలనాయుడు, నాగభూషణరావు, సూపర్వైజర్ ఇందిర, ఎఎన్ఎం సునీత, వైద్య, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎన్.సింహాచలం, గణపతిరావు, వెంకట నాయుడు, ఎన్.ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను విజయవంతం చేయాలి

జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు

ప్రజాశక్తి-పాలకొండ

విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. బుధవారం పాలకొండలో సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. కార్మికవర్గం త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాల స్థానంలో లేబర్ కోడ్లు తీసుకువచ్చిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలు పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలకు సేవచేయాలని అధికారం ఇస్తే.. పెట్టుబడిదారులకు దాసోహమవుతున్నారని విమర్శించారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు పోరాటం సాగిస్తోందన్నారు. అలాంటి సిఐటియు జాతీయ మహాసభ తొలిసారి విశాఖపట్నంలో జరుగుతుందని, అందులో భాగంగా జనవరి నాలుగో తేదిన భారీ బహిరంగ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, బి.కూర్మారావు, ఎ.అసిరయ్య, బి.రవి, బి.అప్పడు, ఎ.ఆనంద్, నూతయ్య, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. మహాసభ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద విడుదల చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు గౌరీశంకర్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆలిండియా మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం మండల కార్యదర్శి పోల సింహాచలం ఆధ్వర్యాన ఆవిష్కరించారు.

వీరఘట్టం : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను ఆ యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగు లేబర్ కోడ్లు కార్మికులను బానిసలుగా మార్చేందుకు వీలుగా ఉన్నాయని, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులను కాలరాస్తున్నాయని తెలిపారు. రాజకీయ వేధింపులు పెరిగి, భద్రత కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎన్ సింహాచలం, ప్రసాదరావు పాల్గొన్నారు.

పాలకొండ, వీరఘట్టంలో సిఐటియు జాతీయ మహాసభ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ

పాచిపెంట.. ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఇఒ, విద్యార్థులు

ప్రజాశక్తి-సాలూరు

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ చూపించాలని ఎంఇఒ నల్ల వెంకటరావు తెలిపారు. శ్రీరామా కాలనీలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.ధనలక్ష్మి, సహిత విద్య ఉపాధ్యాయులు వి.జగన్మోహన్రావు, సిహెచ్. అప్పలనాయుడు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు..

సీతానగరం: వికలాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంఆర్‌సి భవనం నుంచి బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం ఎంఆర్‌సిలో ఏర్పాటుచేసిన సభలో ఎంఇఒ ఎం.వెంకటరమణ మాట్లాడారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో మరిపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ శంకర్రావు, కేంద్రం నిర్వాహకులు రామలక్ష్మి పాల్గొన్నారు.

మక్కువ : మక్కువ భవిత కేంద్రంలో వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఎంఇఒ శ్యామసుందర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సంగం, సహిత విద్య ఉపాధ్యాయులు టి.శైలజ, జి.రవికుమార్, చెన్నయ్య పాల్గొన్నారు.

కురుపాం : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలిచిన వికలాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్ర టీచర్లు ఎం.గౌరీశ్వరి, ఎన్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భవిత కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంఇఒ పి.సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.ఈశ్వరరావు, కె.సత్యవతి, పి.సురేష్ పాల్గొన్నారు.

మక్కువ.. బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ శ్యామసుందర్